ఉధృతంగా ప్రవహిస్తున్న హంటర్‌రోడ్డులోని బొందివాగు

శాయంపేట : మత్తడిపోస్తున్న మొద్దుల చెరువు

ఆత్మకూరు : కామారం శివారులో నీట మునిగిన పంట పొలాలు

మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు

ఐనవోలు : పున్నేల్ శివారులో నేలకొరిగిన మక్కజొన్న

గెరువిచ్చిన వాన

- కుదుట పడిన నగరం
- త్రినగరిలో రోడ్లు ధ్వంసం
- లోతట్టు ప్రాంతాల్లో తొలగని వరద
- పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు
- జిల్లాలో మత్తడి దుంకుతున్న పలు చెరువులు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 2 : రెండు రోజులుగా జిల్లాను ముంచెత్తిన వాన గెరువిచ్చింది. వరంగల్ నగరంలో వరద నీటితో నిండిన రహదారులు ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకున్నాయి. లోతట్టు కాలనీల ప్రజలు తమ రోజువారీ పనులకు వెళ్లారు. సోమవారం అడపాదడపా వాన కురిసింది. కాగా, రెండు రోజులు దంచి కొట్టిన వర్షంతో నగర ప్రధాన రహదారులు ధ్వంసమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీఆర్ కాలనీ, సంతోషిమాత కాలనీ, కాజీపేట దర్గా సమీపంలోని ఇందిరమ్మ కాలనీ, ఎన్ఎన్ కాలనీ, బీఆర్ కాలనీల్లో వరద నీరు ఇంకా నిలిచే ఉన్నది. బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కొనసాగిస్తున్నారు. బాధితులకు బల్దియా అధికారులు భోజనం అందిస్తున్నారు.

రోడ్లు ధ్వంసం..

నగరంలోని ప్రధాన రహదారులు వర్షంతో కంకర తేలాయి. పలు రోడ్లు కోతకు గురయ్యాయి. హనుమకొండ బస్ స్టేషన్, ములుగు రోడ్డు, ఆటో నగర్ రోడ్డు, పోతన నగర్, కరీమాబాద్ ఆర్వోబీ రోడ్డు కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మత్తడి పోస్తున్న చెరువులు..

నగరంలోని భద్రకాళి, వడ్డేపల్లి, భట్టుపల్లి, ఉర్సు చెరువులు మత్తడి పోతున్నాయి. దీంతో నగరంలోని ప్రధాన నాలాలు నిండుగా ప్రవహిస్తున్నాయి. బొంది వాగు నాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువులు మత్తడి పోస్తుండడంతో వాటి కింద ఉన్న కాలనీల ప్రజలు భయంతో వణికి పోతున్నారు.

జిల్లా సగటు వర్షపాతం 37.1మిల్లీమీటర్లు

హనుమకొండ జిల్లాలో సోమవారం వరకు సరాసరి వర్షపాతం 37.1మిల్లీ మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ధర్మసాగర్ మండలంలో 90.2మిల్లీమీటర్లు, నడికూడ 5.4, భీమదేవరపల్లి 51.7, వేలేరు 36.2, ఎల్కతుర్తి 59.4, కమలాపూర్ 13.5, హసన్‌పర్తి 24.1, కాజీపేట 58.0, హనుమకొండ 49.6, ఐనవోలు 64.4, పరకాల 24.7, దామెర 19.5, ఆత్మకూరులో 14.8, శాయంపేట మండలంలో 8.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు మండలంలోని కటాక్షపురం పెద్ద చెరువు అలుగు పోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కామారం, ఆత్మకూరు, నీరుకుళ్ల, కటాక్షపురం శివారులో పంట పొలాలు నీటి మునిగాయి. నీరుకుళ్ల గ్రామంలో ఇంటి గోడ కూలిపోయింది. దామెర మండలంలోని ఊరుగొండ పెద్ద చెరువు, కోగిల్వాయి శనిగ చెరువు మత్తడి పోస్తున్నాయి. పసరగొండకు వెళ్లే మార్గంలో లో లెవల్ బ్రిడ్జి వద్ద వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు ముళ్లకంచె తొలగించారు. దమ్మన్నపేటలో ఇంటి గోడలు బీటలు పడగా, తక్కళ్లపహాడ్, సీతారాంపురం గ్రామాల్లో రెండు పెంకుటిళ్ల గోడలు కూలాయి. ల్యాదెళ్ల–పులుకుర్తి మార్గంలో ఉన్న లో లెవల్ బ్రిడ్జి పైనుంచి వరద వెళ్తోంది. శాయంపేట మండలంలోని చలివాగు జలాశయం నిండుకుండలా మారింది. 19.5 అడుగులకు నీటిమట్టం చేరినట్లు ఇరిగేషన్ ఏఈ అమృత్ తెలిపారు. ఆయకట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. మండలంలోని 70 చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి.

కాజీపేట దర్గా ఇందిరమ్మ కాలనీలో నిలిచిన వర్షం నీరు

పునరావాస కేంద్రంలో భోజనం అందిస్తున్న గ్రేటర్ సిబ్బంది

వరి, పత్తి, మిర్చి, మక్కజొన్న పంటలను సాగు చేస్తున్న రైతులకు వర్షం ఊపిరి పోసిందని చెప్పారు. ఎల్కతుర్తి మండలంలోని చిన్న కుంటలు మత్తడి పడుతుండగా, చెరువులు 80 శాతం మేర నిండాయి. ఇందిరానగర్‌లో ఓ ఇల్లు నేలకూలింది. కమలాపూర్ మండలంలోని మాధన్నపేట శివారులోని పరకాల–హనుమకొండ రహదారిపై కంఠాత్మకూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎంపీడీవో బాబు పరిశీలించారు. వాహనాలనను గూనిపర్తి, మాధన్నపేట, శనిగరం మీదుగా పరకాలకు మళ్లించారు. ఐనవోలు మండలంలో మక్కజొన్న, పత్తి, వరి పంటలు కొంత మేర నీట మునిగాయి. కొన్నిచోట్ల పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పున్నేల్ ఊర చెరువు మత్తడి పడుతున్నది. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడడంతో సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

దామెర : మత్తడి పోస్తున్న ఊరుగొండ పెద్ద చెరువు

ఐనవోలు: విద్యుత్ లైన్‌ను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు : నీరుకుళ్లలో కూలిన ఇంటి గోడ

యాసంగికి భరోసా

హనుమకొండ సబర్బన్ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం జిల్లా అన్నదాతల్లో యాసంగి పంటల సాగుపై భరోసా ఇచ్చింది. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు, నడికూడ మండలాల్లో వరి నాట్లు మధ్య దశకు చేరుకున్నాయి. పరకాల, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాల్లో కొంత మేర మిగిలి ఉన్నాయి. అయితే వర్షాకాలం మొదలైనప్పటి నుంచి జిల్లాలోని కొన్ని మండలాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో నీళ్లు అందుబాటులో ఉన్న రైతులు మాత్రమే నాట్లు వేసుకున్నారు. ప్రధానంగా కాకతీయ కాల్వ ఆయకట్టు పరిధిలో పెద్ద ఎత్తున పొలాలు నీళ్లు లేక బీళ్లుగానే ఉన్నాయి. అయితే ప్రస్తుత వర్షాలతో అన్నదాతల్లో సంతోషం నెలకొంది. శని, ఆదివారాల్లో భారీ ఎత్తున వర్షం కురువగా, సోమవారం సాధారణ వాన పడింది. పంట నష్టం తక్కువగానే జరిగింది. వర్షం ఇంకా రెండు, మూడు రోజులు ఉండడంతో పాటు మరో వారం రోజుల్లో ఇంకో తుఫాన్ రానుందనే వాతావరణ శాఖ ప్రకటనతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పత్తి చేన్లు ప్రస్తుతం కాయ దశలో ఉన్నాయి. వరుసగా వర్షాలు కురిస్తే మాత్రం పత్తి కాయలు మురిగిపోయే అవకాశాలుంటాయని రైతులు చెబుతున్నారు.

గర్మిళ్లపల్లిలో తెగిన వరద కాల్వ

సుమారు 10 ఎకరాల్లో పంట నష్టం

ఐనవోలు : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కూనూర్ వయా గర్మిళ్లపల్లి మీదుగా నందనం ఆకేరు వాగులో కలిసే వరద కాల్వ మూడు చోట్ల తెగింది. దీంతో కాల్వ ఇరువైపులా ఉన్న 10 ఎకరాల్లోని వరి పంటలకు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వలో పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతోనే కాల్వ తెగిందని వారు ఆరోపిస్తున్నారు.

ఐనవోలు : గర్మిళ్లపల్లిలో తెగిన వరద కాల్వను పూడ్చిన రైతులు

హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ : ముంపు ప్రాంతాల బాధితులు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. సోమవారం ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వీడీఎస్ కాలనీ, బాపూజీ నగర్, ఇందిరమ్మ కాలనీ, ఎన్ఎన్ నగర్, బీఎన్ నగర్, డీకే నగర్, తెలంగాణ కాలనీ, మైసయ్యనగర్ ప్రాంతాలను పరిశీలించారు. కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ముంపు బాధితులతో మాట్లాడారు. అధికారులు అన్ని వసతులు కల్పిస్తారని భరోసా ఇచ్చారు. హెల్త్ క్యాంపు నిర్వహించి వైద్య సేవలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈ శ్రీనివాస్, డీఈ సంతోష్‌బాబు, సారంగం, రాజ్‌కుమార్, ఏఈలు హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్

శిథిలావస్థ గృహాల కూల్చివేత

వరంగల్, సెప్టెంబర్ 2 : గ్రేటర్ పరిధిలో కూలడానికి సిద్ధంగా ఉన్న 348 గృహాలను అధికారులు గుర్తించారు. వాటిని కూల్చివేస్తున్నారు. ఇప్పటికే 108 కుటుంబాలను తరలించి 28 పాత గృహాలను కూల్చివేశారు. సోమవార 41వ డివిజన్ పరిధిలోని పాత కాలం నాటి గృహాలను బల్దియా అధికారులు కూల్చివేశారు. మరికొన్నింటిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

వరంగల్, సెప్టెంబర్ 2 : నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌వో లలితాదేవీ తెలిపారు. సోమవారం హనుమకొండలోని ఏషియన్ మాల్ వెనుక లోతట్టు ప్రాంతం, భట్టుపల్లిలోని ఏజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులను పరిశీలించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు.

9న సీఎం పర్యటన

- హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

మాట్లాడుతున్న సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

హనుమకొండ/వరంగల్, సెప్టెంబర్ 2 : ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో పర్యటించనున్నారని, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో చేపట్టిన, చేపట్టనున్న ప్రతిపాదిత అభివృద్ధి పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుడా ఆధ్వర్యంలో చేపడుతున్న కాళోజీ కళాక్షేత్రం, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం చేస్తున్న భూ సేకరణ ప్రక్రియ, వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, స్మార్ట్ సిటీ, ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రతిపాదిత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు, ఆక్సిజన్ పార్క్ తదితర పనుల పురోగతిపై కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు అధికారులతో చర్చించారు. రెండు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్లు, బల్దియా కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. నయీంనగర్ హై లెవల్ బ్రిడ్జి పనులను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాలాపై నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులను త్వరగా పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. బల్దియా ఆవరణలో నిర్మిస్తున్న పాలనా భవన పనులను త్వరగా చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్, కృష్ణవేణి, ఆర్ అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, కుడా పీవో అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, హార్టికల్చర్ అధికారి రమేశ్, ఇరిగేషన్ డీఈ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రత్నగిరి జాతర

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 2 : రత్నగిరి గుట్టపై కొలువుదీరిన లక్ష్మీసమేత నరసింహస్వామి జాతర సోమవారం ఘనంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు వాటిల్లకుండా పంచాయతీ కార్యదర్శి శ్రీపాద సరిత సదుపాయాలు కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్, ముల్కనూరు ఎస్సై నండ్రు సాయిబాబు బందోబస్తు నిర్వహించారు.

రత్నగిరి గుట్టపైకి దర్శనం కోసం వెళ్తున్న భక్తులు

'కుడా'లో విలీనం వద్దు

- వ్యతిరేకించిన నాలుగు జీపీలు
- అంగీకారం తెలిపిన 4 పంచాయతీలు

శాయంపేట, సెప్టెంబర్ 2: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)లో విలీనం వద్దని శాయంపేట మండలంలోని ప్రజలు అభిప్రాయాన్ని తెలియజేశారు. సోమవారం శాయంపేట, మాందారిపేట, కొత్తగట్టు సింగారం, గట్లకానిపర్తి, మైలారం, పెద్దకోడెపాక, పత్తిపాక, హుస్సేన్‌పల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. శాయంపేటలో విలీనంతో లాభ, నష్టాలు తెలియజేయాలని, ఏకపక్ష నిర్ణయా లు తీసుకోవద్దని, కుడాలో విలీనం వద్దని స్థానికులు వాదించారు. ఏదైనా పర్మిషన్లు కావాలనుకుంటే ఆన్‌లైన్ ద్వారా కుడా నుంచి తీసుకోవాల్సి ఉంటుందని, చార్జీలు పెరుగుతాయని ఆర్ఐ శరత్ అన్నారు. ఇండ్ల నిర్మాణాలకు సిటీ పరిధిలోని నిబంధనలన్నీ వర్తిస్తాయన్నారు. మొత్తం జీపీలు 24 ఉండగా కుడా పరిధిలోకి 13 వెళ్తుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

శాయంపేట: గ్రామసభలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

శాయంపేట, మైలారం, కొత్తగట్టుసింగారం, హుస్సేన్‌పల్లి కుడాలో విలీనం చేయొద్దని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినట్లు ఎంపీవో రంజిత్‌కుమార్ తెలిపారు. పత్తిపాక, గట్లకానిపర్తి, పెద్దకోడెపాక, మాందారిపేట పంచాయతీలు కుడాలో విలీనానికి అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. రెవెన్యూ జీపీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానం అందించాల్సి ఉందని తెలిపారు. నివేదికను అధికారులకు అందిస్తామన్నారు.

కామారంలోనూ..

ఆత్మకూరు : తమ గ్రామాన్ని కుడాలో విలీనం చేయొద్దని కామారం గ్రామ సభలో ప్రజలు ప్రత్యేక అధికారికి సోమవారం తెలియజేశారు. కుడా పరిధిలోకి వెళ్తే ఇంటి నిర్మాణానికి పర్మిషన్లు నేరుగా జీపీ నుంచి తీసుకోలేమని చెప్పారు. గ్రామస్తులందరూ విలీనం చేయొద్దని తీర్మానం చేశారు.

మైనార్టీలను మోసం చేసిన కాంగ్రెస్

హనుమకొండ, సెప్టెంబర్ 2 : రాష్ట్రంలో మైనార్టీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ మైనారిటీ రాష్ట్ర నాయకుడు సోహైల్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మైనారిటీలను విస్మరించిందన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించలేదని, రుణాల ఊసెత్తడం లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా లోన్లు, కుట్టు మిషన్లను అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బడే బాయి మోదీ, రాష్ట్రంలోని చోటే బాయ్ రేవంత్‌రెడ్డి ఇద్దరు మైనారిటీలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. షాదీ ముబారక్ తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, నయీముద్దీన్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ రాష్ట్ర నాయకులు

భక్తులతో కిక్కిరిసిన బియాబానీ దర్గా

కాజీపేట, సెప్టెంబర్ 2: కాజీపేటలోని సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం వర్షంలోనూ భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల పీఠాధిపతులు, ముస్లిం మత పెద్దలు, మతాలకతీతంగా వేలాది మంది దర్గాను దర్శించుకున్నారు. హుండీల్లో కానుకలు వేసి మొక్కులు చెల్లించారు. భక్తులను పీఠాధిపతి ఖుస్రుపాషా ఆశీర్వదించారు. రాత్రి కవ్వాలి, భజన, కీర్తన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు మినరల్ వాటర్ పంపిణీ చేశారు. అన్నదానం కూడా చేశారు. దర్గా పరిసరాల్లో పలు దుకాణాలు ఏర్పాటు చేయగా భక్తులు తమకు కావాల్సినవి కొనుగోలు చేశారు. ఏసీపీ తిరుమల్ రావు ఆదేశానుసారం కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా, దర్గా ఉత్సవాల ముగింపులో రోజైన మంగళవారం మధ్యాహ్నం పకీర్ల విన్యాసాలు ప్రదర్శించనున్నారు. దర్గాను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించారు. దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా స్వాగతం పలికారు. స్పీకర్‌తో పాటు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఖుస్రుపాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్పీకర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సోమవారం దర్గాను సందర్శించి పూల్‌చాదర్ సమర్పించారు. యువ పీఠాధిపతి భక్తియార్ బియాబాని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, పీఠాధిపతి ఖుస్రుపాషా

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 2 : కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేస్తూ కులగణన చేపడతామని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలుచేయాలని ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. 9 రోజులుగా ఎంజీఎం వద్ద ఆమరణ దీక్ష చేస్తున్న చాపరతి కుమార్, సిద్ధన్న, సంజయ్‌కు మద్దతుగా అంబేద్కర్ విగ్రహం నుంచి ఎంజీఎం వరకు పాదయాత్రగా తరలివెళ్లి పరామర్శించారు.

ఎంజీఎం దవాఖానకు పాదయాత్రగా వెళ్తున్న నాయకులు

కొత్తకొండ గుట్టపై అభివృద్ధి పనులు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 2: చారిత్రక కొత్తకొండ వీరభద్రస్వామి గుట్టపై అభివృద్ధి పనులు జరుగుతాయని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో నక్షత్రదీక్ష మాల విరమణ చేశారు. ఆయన మాట్లాడుతూ 27రోజుల పాటు నక్షత్రదీక్ష తీసుకున్న తాను స్వయంగా గుట్టపైకి ఎక్కినట్లు తెలిపారు. గుట్టపై స్వయంభూ శివాలయం ఉందని, శిథిలావస్థలో వీరభద్రస్వామి ఆలయం, కోనేర్లు, అతిపెద్ద రాతిగోడలు ఉన్నాయని అన్నారు. సామాన్య భక్తులు సైతం గుట్టపైకి ఎక్కేలా నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆలయ అభివృదిలో భాగంగా ఇప్పటికే ధ్యానమందిరం నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు వెలిచాల రాజేందర్‌రావు, జంగా రాఘవరెడ్డి, వొడితల ప్రణవ్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, నాయకులు చంద్రశేఖర్‌గుప్తా, అదరి రవీందర్, కొలుగూరి రాజు, ఊసకోయిల ప్రకాశ్, ఆలయ ఈవో కిషన్‌రావు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో సతీసమేతంగా పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రైల్వే ప్లాట్‌ఫారంపై మృతదేహం

కాజీపేట, సెప్టెంబర్ 2 : కాజీపేట రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై సోమవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై గుర్తించినట్లు తెలిపారు. మృతుడి వయసు 60–65 ఏండ్ల మధ్య ఉంటుందని, చామనఛాయ రంగు ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించామన్నారు. కాజీపేట జీఆర్పీ దా 8712658609లో సంప్రదించాలని కోరారు.

యువకుడిపై కేసు నమోదు

ఆత్మకూరు, సెప్టెంబర్ 2 : మండలంలోని అక్కంపేటకు చెందిన ఓ యువకుడు తనను వేధింపులకు గురిచేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనగటి విక్రమ్(24) రెండేళ్ల క్రితం ఆమెను ఇబ్బందులకు గురిచేయగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 20రోజుల క్రితం లోక్ అదాలత్‌లో ఆ కేసు కొట్టేశారు. కానీ మూడు నెలలుగా ఆమె మెసేజ్‌లు పంపినట్లు క్రియేట్ చేసుకొని అందరికీ చెబుతూ తన పరువు తీస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత

మడికొండ, సెప్టెంబర్ 2: తప్పిపోయిన వృద్ధురాలిని మడికొండ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మడికొండకు చెందిన వృద్ధురాలు తలగాని సరోజ ఆదివారం ఇంటి నుంచి బయటికి వచ్చి దారి తెలియక తిరుగుతుండడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆమె వద్ద వివరాలు సేకరించి సోషల్ మీడియాలో షేర్ చేసి కుమారుడు తలగాని సంతోష్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వృద్ధురాలిని ఆమె కొడుక్కు అప్పగిస్తున్న పోలీసులు

వర్షాలకు రోడ్లపై నీళ్లు ఆగొద్దు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 2 : తేలికపాటి వర్షాలకు సైతం ప్రధాన రహదారుల వెంట నీరు నిలువకూడదని, నాలాలు బహిరంగంగా ఉండేలా నిర్మించుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బాలసముద్రం ప్రధాన రోడ్డును కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి కేయూ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

పరకాల, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. నడికూడ మండలం నార్లాపూర్‌లోని వాగు వద్ద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సహాయక చర్యలపై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటికి రావద్దన్నారు. అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

CHANGE OF NAME

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ADITH REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR SONS NAME TO MATTA AADITH REDDY.
NT-331741

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ARADYA SIRI REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR DAUGHTERS NAME TO MATTA AARADHYA SIRI REDDY.
NT-331741

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565